III




...."ఈ నిజం తెలుసుకో...." అన్నది టాల్‌స్టాయ్ కథలతో సరితూగగల సత్తువ ఉన్నది. పెద్దవాళ్ళు ఫరవాలేదు అనుకుని అవసరం కోసం చేసే తప్పులు పసివారి గుండెలమీద ఎంతబలంగా పని చేస్తాయో అలాంటి తప్పులు మరి జన్మలో చేయగూడదనే అభిప్రాయానికి వారు ఎలావస్తారో అన్నది.... ఈ కథ। తల్లిదండ్రులను కూడ క్షణ కాలం విభ్రాంతి పరచి వారి మనసులలోనూ అలాంటి బిడ్డను కన్నందుకు ఎనలేని సంతృప్తిని కలిగించిన కృష్ణుడి కథ ఇది! తనను నముకున్న వ్యక్తికి అనంతమైన మానసికానందం పంచి ఇస్తుంది, ఈ నిజం। ఈ చిన్న కథ చెప్పిన ఆ

పరమ సత్యం అందరి గుండెల్లోనూ శాశ్వతమై నిలిచిపోతుంది।

ఒక అణువు పగిలి జగత్తును తృటిలో సర్వనాశనం చేస్తుంది. కాని ఒక సత్యవచనం పరాకాష్ఠ చెందినదశలో విశ్వవ్యాప్తమై సమస్త ప్రపంచాన్నీ తన వెలుగులో యిముడ్చుకుంటుంది.

ఈ నిజం తెలుసుకుంటేచాలు।

—రంధి సోమరాజు.

"క్రిష్ణా, ఒరే క్రిష్ణా!"

చదువుకుంటున్న పుస్తకాన్ని ప్రక్కన పెట్టి, "ఏం నాన్నగారూ" అంటూ రాజారావు కెదురుగా వచ్చి నిల్చున్నాడు క్రిష్ణ.

"చూడూ. ఈ లీవ్ లెటర్ తీసుకెళ్ళి బస్ స్టాపులో మా ఆఫీసు వాళ్ళెవరన్నా ఉంటే ఇచ్చిరా."

"సుబ్బారావు గారికి ఇవవ్వచ్చా?"

"ఓ! ఎవరున్నా ఇచ్చిరా. చూడూ ఎవరైనా అడిగితే నాకు ఒంట్లో బాగాలేదని చెప్పు. తెలిసిందా."

తండ్రివంక ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాడు క్రిష్ణ.

"ఇంకా ఇక్కడే నిల్చున్నావేం? నే చెప్పింది బోధ పడలేదూ." రాజారావు గొంతు ఖంగుమంది.

బోధపడిందీ....లేదూ.... అన్నట్టు మధ్యస్థంగా తలూపి బయట పడ్డాడు.

స్కూల్లో ఉన్నంతసేపూ అదే ఆలోచన ఉండబట్టలేక మధ్యాహ్నం భోజనం చేస్తున్నప్పుడు తల్లిని అడిగాడు.

"అమ్మా మరేమో....నాన్నగారికి వంట్లో బాగాలేదా?"

ఆశ్చర్యంగా కొడుకు ముఖంలోకి చూసింది సుమిత్ర.

"ఎవరు చెప్పేర్రా నీకు?"

"నాన్నగారే. సెలవు పెట్టారుగా" అన్నాడు.

ఫక్కున నవ్వింది సుమిత్ర. ఆశ్చర్యంగా చూసేవంతు అపుడు క్రిష్ణుడిదయింది.

"వెర్రి మొద్దూ! అలా రాస్తేగాని వాళ్ళకు ఆఫీసు వాళ్ళు సెలవు

15)

ఇవ్వరు. అందుకని అట్లా రాశాడుగాని మీ నాన్నగారికేం, సుబ్బరంగా ఉన్నారు" అంది.

తల్లి మాటలకు మరింత ఆశ్చర్యం కలిగింది కృష్ణకు.

"అంటే వంట్లో బాగాలేదంటేగాని సెలవు కావలసినప్పుడు ఇవ్వరా?" అడిగాడు మళ్ళీ.

"ఆ విషయాలు నీ కెందుగ్గాని ముందు అన్నం తిని బయటకెళ్ళు" పెరుగు వడ్డించి లేచింది సుమిత్ర.

క్రిష్ణుడి మనసుకు ఒక కొత్త నిజం కన్పించింది.

*　　　*　　　*

"ఇలా ఇస్తే కుదరదమ్మా, వందలకు వందలూ మీకు అరువు లిచ్చి వ్యాపారం చేస్తున్నామంటే, మా పరిస్థితి మీరూ ఆలోచించాలి. కనీసం ఎనభైయ్యైనా చెల్లు వెయ్యకపోతే సామాను ఇవ్వలేం." కిరణా కొట్టు శెట్టి నిక్కచ్చిగా చెప్పేశాడు.

"ఇచ్చేవాళ్ళమో, ఇవ్వని వాళ్ళమో మీకు తెలియదా శెట్టిగారూ. ఈ నెలలో అర్జంటు ప్రయాణాలు తగిలి అనవసరంగా డబ్బు ఖర్చయి పోయింది. లేకపోతే మీ బాకీ పూర్తిగా తీర్చేద్దామని అనుకున్నా" అంది సుమిత్ర.

తల్లి ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు క్రిష్ణ.

సుమిత్రకూ, శెట్టికీ మధ్య చాలసేపు సంభాషణ జరిగింది. చివరికి సుమిత్రే గెలిచింది.

సామాను ఇంట్లో పెట్టించాక డబ్బాల్లోకి పప్పులు సర్దడంలో తల్లికి సాయపడుతూ అసలు విషయాన్ని అడిగాడు క్రిష్ణ.

"ఈ నెలలో మనం ఎక్కడికీ వెళ్ళలేదు గదా. మరి ఆ శేట్టితో ఎందుకలా చెప్పావమ్మా" అని.

"అలా చెప్పకపోతే వాడు సామానిస్తాడట్రా వెర్రి తండ్రి. ప్రతి

నెలా ఏదో ఒకటి సర్దిచెప్పి తీసుకొస్తున్నా గాబట్టి సరిపోతోంది. ఈ తిప్పలన్నీ మీ నాన్నగారికి తెలుస్తాయా, ఏమన్నానా? డబ్బు సరిపోవటం లేదండీ అంటే, కుర్చీలో కూర్చుని మహారాజులా నవ్వుతారే తప్ప క్రియ మాత్రం శూన్యం."

క్రిష్ణ ముఖంలో ఆశ్చర్యం చోటుచేసుకుంది.

అబద్ధం చెబితేగాని అరువు పుట్టదు, అరువు పుడితేగాని రోజు గడవదు. తల్లి మాటల్లోని మరొక నిజం క్రిష్ణకు అవగతమయ్యింది.

* * *

"నిజం చెప్పరా! స్కూలుకు రాకుండా ఎక్కడికెళ్ళావుపొద్దున్న" లెక్కల మాష్టారు గొంతు ఖంగుమంది. నలబైమంది పిల్లల మధ్యా నేర స్థుడిలా నిలబడ్డాడు సంతోష్. వాడి ముఖంలో ఏ భావమూ లేదు.

"చెప్పవేం?" మాస్టారి బెత్తం బెంచీమీద చెళ్ళుమంది.

ఏం చెబుతాడోనని అంతా చూస్తున్నారు.

"మా అమ్మకు జ్వరం, డాక్టరు దగ్గరకెళ్ళాం" నిర్భయంగా సమాధానం చెప్పిన సంతోష్‌వంక ఆశ్చర్యంగా చూశాడు కృష్ణ.

అగ్గిలాంటి మాస్టారు మంచులా కరిగిపోతూ,

"వెధవలు, స్కూలెగ్గొట్టడం, ఏదో కారణం చెప్పడం. మామూలై పోయింది" అంటూ బోర్డువంక తిరిగాడు.

క్రిష్ణుడికింక కూర్చో బుద్ధికాలేదు. ఏమైనా సరే చెప్పేయ్యాలనుకున్నాడు.

"ఏం? నీకేమైంది?" నిల్చున్న క్రిష్ణుడివంక చూస్తూ అడిగారు మాస్టారు.

"సంతోష్ చెప్పింది అబద్ధం మాస్టారూ. పొద్దుట నేను వాళ్ళింటికి వెళ్ళినపుడు వాళ్ళమ్మ బాగానే ఉంది. సంతోష్ స్కూలుకు వెళ్ళాడని ఆవిడ చెప్పింది. కావలిస్తే కనుక్కోండి" అంటూ కూర్చున్నాడు.

"నిజమేన్రా" మాస్టారు ఉగ్రరూపం దాల్చాడు.

సంతోష్ చెంప చెల్లుమంది. గదంతా నిశ్శబ్దం ఆవరించింది. ఎరు పెక్కిన కళ్ళతో కృష్ణవంక చూశాడు సంతోష్. ఆ చూపు కుందేలు వంక చూసిన సింహం చూపులాఉంది.

కాస్త భయమనిపించినా తను చేసింది మాత్రం తప్పు కాదనిపిం చింది క్రిష్ణకి. చూపును తప్పించుకుని బ్లాక్‌బోర్డు వెనుక వేలాడదీసిన అట్ట బోర్డువంక చూశాడు.

"అబద్ధములాడరాదు. ఎల్లప్పుడు సత్యమునే పలుకవలెను.

*　　　*　　　*

"మిమ్మల్ని ఇక్కడికి ఎందుకు పిలిచానో తెలుసా?"

హెడ్‌మాస్టారి మాటలకు ఆ గదిలోకి రప్పించబడిన పదిమంది పిల్లలూ ఒకరివంక ఒకరు చూసుకున్నారు. చూసుకుని బోధపడక ఆయన వంకే చూశారు.

"వచ్చే గాంధి జయంతికి ఈ వూళ్ళో ఉన్న నాలుగు స్కూళ్ళ విద్యార్థులకూ కలిపి తరగతుల వారీగా ఎస్సే కాంపిటీషన్ జరపాలను కున్నాం, మన స్కూలు అనింటిలో ఫస్టు రావాలి తెల్సిందా."

అందరూ తలలూపారు. మాస్టారు మరేదో చెప్పబోతుండగా టేబిల్‌మీద ఫోన్ మ్రోగింది. ఫోను తీయబోతూ అనుమానంగా ముఖం పెట్టి ఆ పని విరమించుకున్నాడు.

మళ్ళీ ఫోను మ్రోగేసరికి ప్రక్కనున్న బంట్రోతువంక చూసి "పెధవది. ఫోనుండడం కాదు కాని చచ్చిపోతున్నాం. చూడు—ఎవరో కనుక్కుని ఎమ్మెల్యే రంగనాధంగారైతే మాత్రం నేను లేనని చెప్పు. వెధవ రికమండేషన్లతో ప్రాణాలు పోతున్నాయి. ఉన్న ఒక్క బడిపంతులూ ఉద్యోగానికి నలభైమంది రికమండేషన్లు. నాలుగొందల ఫోన్లును."

అంటూ పిల్లల వంక చూరారు. వాళ్ళు పిల్లల్లా కాక మంత్రిగారిముందు చేతులు కట్టుకు నిలబడ్డ వంధి మాగధుల్లా కన్పించారాయన కళ్ళకి.

మాస్టారు చెప్పమన్న అబద్దాన్ని అబద్ధంగా కాక నిజంగానే చెప్పాడు బంట్రోతు.

"నే చెప్పింది బోధపడింది గదా" అన్నారాయన తిరిగి పిల్లలవంక చూసి.

అంతా తలలూపారు.

"బోధ పడిందీ లేదూ."అన్నట్లు మధ్యస్థంగా తలూపాడు క్రిష్ణ. గది గోడకు వ్రేలాడగట్టిన గాంధిగారి పటం వంక చూస్తూ. క్రిష్ణకి బోధ పడిందొక్కటే. హెడ్‌మాస్టారు కూడా అబద్ధం ఆడగలరూ అనే.

* * *

లేడి పిల్లలా గుమ్మంలోకి అడుగుపెడుతున్న క్రిష్ణకి, ఎదురుగా పులిలా కూర్చున్న తండ్రిని చూసేసరికి కాళ్ళలో వణుకు పుట్టింది. వళ్ళంతా చెమట పట్టింది. అయినా తమాయించుకుని మామూలుగా లోపలికి పోబో యాడు.

"అగు!" అది సింహగర్జనే. "మధ్యాహ్నం ఎక్కడికెళ్ళావ్?"

"ఏమని చెప్పాలి? అసలు చెప్పాలా వద్దా?" తటపటాయించాడు క్రిష్ణ.

ఎదురుగా సింహంలాంటి తండ్రి. మనసులో చెప్పకూడని నిజం.

"అబద్ధం చెప్పరాదు". స్కూల్లోబోర్డు. 'సత్యంవద' గాంధీగారి ఫోటోక్రింద సూక్తి.

"స్కూల్లేదుటగా ఎక్కడ తిరిగొచ్చావురా ఇంతసేపూ" లేచి నిల్చుంది సింహం.

కుందేలు పిల్లలా వణికినా ధైర్యంగా నిలదొక్కుకున్నాడు క్రిష్ణ. యుక్తి, కుయుక్తులు చేతగాలేదు.

"రాజేష్ రమ్మంటే సినిమాకు వెళ్ళాను "

"రాస్కెల్! పట్టుమని పదేళ్ళులేవు చెప్పకుండా సినిమాలా?" సింహం గర్జించి మీద పడింది. చేతిలో తోలు పటకా.

దెబ్బలూ.... తిట్లూ.... ఏడుపులూ.

వాతావరణం శాంతపడటానికి చాలా సేపే పట్టింది.

* * *

క్రిష్ణలో ఆపుకుందామన్నా ఆగని దుఃఖం పెల్లుబుకుతోంది. కళ్ళలో నిండిన నీరు చదువుతున్న పుస్తకంలోని అక్షరాలను కన్పించనీయకుండా చేస్తున్నాయి. మనసు పాఠం మీద నిమగ్నం కావటం లేదు.

తను చేసింది తప్పా?

ఏది తప్పు? నిజం చెప్పటమా? సినిమా కెళ్ళడమా?

హటారీ జంతువుల సినిమా. అది చూడక పోయినా దెబ్బలు తప్పేవే!

"మీ అమ్మవాళ్ళతో కావలిస్తే చెబుతాలే. ఫర్వాలేదు రా" అంది రాజేష్ తల్లి.

క్రిష్ణ కళ్ళముందు అన్నీ గజిబిజిగా కదులాడుతున్నాయి.

"అలా రాయకపోతే సెలవు ఇవ్వద్దూ" తల్లిమాట.

"సత్యమేవ జయతే" గాంధీ మాట.

"అబద్ధమాడకపోతే గడిచేదెట్లా అవసరం.

"లేనని చెప్పు.... వెధవలు...."

అమ్మకి జ్వరం.... డాక్టరు...."

తల్లీ, తండ్రీ, గురువు, తోటి విద్యార్థి అందరూ అవసరంకోసం అబద్ధమాడుతూనే ఉన్నారు.

కానీ తను?....

ఒక్కసారి తనే అందరికంటే ఉన్నతుడిగా ఉన్నట్లనిపించింది

క్రిష్ణకు. అంతే! అతని మనసులో కలవరం తగ్గింది. అంతవరకూ నిబిడీకృతమైన అర్థంకాని నిజమేదో పొగమంచులా విడిపోయింది.

*　　*　　*

మెత్తని చల్లని స్పర్శకు కళ్ళు తెరిచి చూశాడు క్రిష్ణ. ఎదురుగా తల్లి! తల నిమురుతోంది.

"లేవరాదూ! చాలా పొద్దెక్కింది" అంటూ ప్రక్కన కూర్చుంది.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు క్రిష్ణ. క్రితంరోజు జరిగిన సంఘటన గుర్తొచ్చి తల్లి కళ్ళలోకి చూడలేకపోయాడు.

"నిజం చెప్పడం తప్పా అమ్మా" అన్నాడు కాస్సేపాగి.

కొడుకు ఉద్దేశం అర్ధమైందామెకు.

"లేదు. క్రిష్ణా! మేం చెప్పలేని నిజాన్ని నువ్వు ధైర్యంగా చెప్పినందుకు చాలా సంతోషంగా ఉంది. ఆ క్షణంలో కోపగించుకున్నా జరిగిందానికి మీ నాన్నగారూ ఎంతో బాధపడుతున్నారు. ఆయన రాత్రంతా నిద్రపోలేదు. మరి నువ్వు అలా చెయ్యొచ్చా? ఆయన స్థితి నువ్వూహించుకోవాలి మరి!"

తల్లివంక ఆశ్చర్యంగా చూశాడు క్రిష్ణ. నిజమే! తనూ తప్పు చేశాడు. అయితే తను చెప్పిన నిజానికి మాత్రం విలువ ఉంది అంతేచాలు!

"మరెప్పుడూ అలా చెయ్యనమ్మా, నాన్నగారితో చెప్పవూ?" ఈ మాట లంటున్న క్రిష్ణకు వెయ్యి ఏనుగుల బలమొచ్చినట్లయింది.

గులాబీల్లాంటి కళ్ళు మల్లెలయ్యాయి!

(ఆంధ్రప్రభ. 21-3-1979)